'శ్రీ'వారికి ప్రేమలేఖ' సినిమా చూసి హాస్టలు వైపు నడక ప్రారంభించాం నేను, విశ్వం, రవీంద్ర నాథ్, నర్సింహం. మేం నలుగురం చిన్నప్పటినుంచి మంచి స్నేహితులం. చాలా కాలం తర్వాత మంచి, నవ్వుల తెలుగు సినిమా చూసొచ్చాం అని ఆనందంగా ఉంది.

బహుశా 'ఆనాటి 'అందాల రాముడు' తర్వాతఅంతలా నవ్వించిన సినిమా ఇదేనేమో. నేను, రవి, విశ్వం సినిమా గురించి చెప్పుకుంటూ నవ్వుకుంటూ నడుస్తుంటే నర్సి మాత్రం చాలా దిగులుగా జీవితంలో సర్వస్వం కోల్పోయినవాడిలా మా వెంట నడుస్తున్నాడు.

"ఏరా! అంత చక్కటి సినిమా చూశాక కూడా డల్‌గా ఉన్నావ్? మీ ఆవిడగాని గుర్తొచ్చిందా?" విశ్వం అడిగాడు నర్సిని. మాలో నర్సికి ఒక్కడికే చదువుకుంటూండగానే. వాళ్ళ బామ్మ ఈనాడో, రేపో అనేలా వుందని ఇంట్లో పెద్దలు ఈ మధ్యే పెళ్ళి చేశారు. నర్సిలో వులుకు పలుకులేదు.

"విషయం చెప్పరా సన్నాసీ!" రవి అడిగాడు నర్సి భుజాలు పట్టి కుదుపుతూ.

"నాకా అదృష్టం లేదురా."

"ఏమిటీ సంధి ప్రేలాపన? అసలే టెన్షనుగా వుంది పాయింటులోకి రారా" నేను అడిగాను.

"హీరోయిన్ చూడరా. ఎంతటి చక్కటి ఉత్తరం రాసిందో! మా ఆవిడా వుంది మూణ్ణెల్లయి పెళ్ళయినా అటువంటి ఉత్తరం రాయలేదు. ఉత్త పల్లెటూరి మొద్దుని కట్టుకున్నాను" నర్సిగాడు తన బాధంతా వెళ్ళగక్కాడు.

"ఓరి బడుద్ధాయ్! వదినగారిని అంత మాట అంటావుటరా! అయినా ఉత్తరం హీరోయిన్ రాయలేదురా, నీకు బొత్తిగా సినిమాల సంగతి తెలీదు. వేటూరి, జంధ్యాల రాశారు" విశ్వం అన్నాడు తనకున్న సినిమా జ్ఞానాన్నంతా ప్రదర్శిస్తూ.

"మీరేంచెప్పండి నేను దురదృష్టవంతుణ్ణి" నర్సి తన ధోరణి మార్చలేదు.

"ఓసోస్! ఇందాకటి నుంచి చూస్తున్నాను. నీ భార్యామణి రాయలేదని గొడవేగాని నీకున్న జ్ఞానం ఎంతరా? నాలుగు తప్పులు లేకుండా తెలుగులో ఉత్తరం రాయి పార్కర్ పెన్ను కొనిపెడతాను. అవలించకు.... ప్రేగులు లెక్కపెట్టగలను. నువ్వు అమ్మవు. నేను మేనమామను కానంత మాత్రాన మన హిస్టరీ నాకు తెలియదనుకోకు" నేను దబాయించాను.

"ఆ మాత్రం వుత్తరం రాయలేననుకున్నావురా అజ్ఞానీ!" నర్సిగాడికోపం తారా స్థాయినందుకుంది. దవడ ఎముక బిగుసుకుందో లేదో చూసే లోపు మొహం అటువైపుకు తిప్పుకున్నాడు.

"పందెం వేయకు అప్పారావ్! ఓడిపోవడం ఖాయం" నేను గట్టిగా సమాధానం ఇచ్చాను.

"రెండు రోజులు ఆగు మన తడాఖా"నర్సిగాడు జవాబిచ్చాడు పట్టుదలగా.

మూడు రోజుల తర్వాత సాయంకాలం నా రూములో నేను, విశ్వం, రవి పాటలు వింటూ కబుర్లు చెప్పుకుంటూంటే ఓ కాగితం, పెన్ను పుచ్చుకు వచ్చాడు నర్సి.

"ఏమండీ శ్రీవారూ. ప్రేమ లేఖ ఎన్ని దస్తాలు రాశారు? ఇంకో దస్తా కాగితాలు పడేయించమంటారా ఏంటి?" విశ్వం అడిగాడు వ్యంగ్యంగా.

"ఏడిపించండిరా, ఇంగ్లీషులో ఓ సామెత వుంది. ప్రతి కుక్కకూ ... ఎందుకులెండి అవసరం నాది. అయినా ఈ కష్టాలు మీకూ పెళ్ళయ్యాక తెలుస్తాయిలెండి" అన్నాడు నర్సి.

"ఇంతకీ ఏమిటంటావ్? నీ అసమర్థతని అంగీకరిస్తున్నావుకదా?" రవి అడిగాడు.

"ఒరేయ్ మీ అందరికీ చైనీస్ రెస్టారెంటులో మీక్కావలసినంత తిండి పెట్టిస్తారా."

"పాయింటులోకి రా అబ్బాయ్."

"ఈ ఉత్తరం రాయడంలో మీరంతా తలోచెయ్యి వెయ్యాలిరా."

"తప్పురా జంతుసమానా, మూర్ఖత్వానికి నమూనా! మీ ఆవిడకు మేం ఉత్తరం రాయడం ఏమిటి? ఇదేమన్నా పురాణకాలం అనుకున్నావా? ఎవరేనా వింటే నవ్వి అంతటితో ఆగక గడ్డిపెడతారు."

"వేళాకోళానికిది సమయం కాదురా. చచ్చి మీ కడుపున పుడతారా. ఒకవేళ నేనుపోకుండా అబ్బాయి పుడితే మీ ముగ్గురి పేర్లూ కలిపి పెట్టుకుంటానురా. నన్ను మీ నుంచి వేరుచేసి మాట్లాడకండిరా"—నర్సి ఏడవడం తరువాయి.

"ఇప్పుడు నీవిజ్ఞానం'అంతా ప్రదర్శిస్తూ వుత్తరం రాయకపోతే ఏం? మామూలుగా ఉభయకుశలోపరి టైపు వుత్తరం రాసి పడెయ్యకూడదూ."

"అలా కాదురా. మా ఆవిణ్ణి మూర్ఛపోయేలాచెయ్యాలి. నా అంతవిజ్ఞానవంతుణ్ణి కట్టుకున్నందుకు చాలా అదృష్టవంతురాలని మురిసిపోవాలి."

వాడి బాధ చూడలేక మేం ముగ్గురం తప్పు పని అయినా నర్సిగాడి భార్యగారికి ముచ్చటైన ప్రేమలేఖ రాయడానికి ఉపక్రమించాం. ఇలాంటి ఉత్తరాలు రాసే అలవాటు మాకు బొత్తిగా ఎవరికీ లేదు. చదివిన తెలుగు పుస్తకాలన్నీ గుర్తుతెచ్చుకున్నాం. ఒకళ్ళ జుట్టు ఇంకోళ్ళు పీక్కున్నాం. అయినా సరే కలం కదలనని మొరాయించింది. చివరకు నాకు బ్రహ్మాండమయిన ఐడియా వచ్చి నవో దయా వారు పబ్లిషించిన 'శ్రీరమణ పేరడీలు' పుస్తకం బయటకు తీశాను. విశ్వనాథగారి నుంచి బుడుగు వరకు ప్రేమలేఖలు ఎలా రాస్తారో శ్రీరమణ చక్కగా అనుకరించారు.





"ఇక ప్రేమలేఖ రాద్దామా, నిముషాల మీద పని" రవి అన్నాడు.

మేం అందరం ఆ పుస్తకం కనీసం ఐదు సార్లైనా చదివి వుంటాం.

"ఒరేయ్! బొత్తిగా శ్రీరమణగారి పుస్తకంనుంచి కాపీ కొట్టడం-అందులోనూ ముక్కకి ముక్క తప్పేమోరా" విశ్వం అనుమానం లేవదీశాడు.

"తప్పేముందోయ్! పాఠ్య పుస్తకాల నుంచి రాసుకోవడంలేదా. అలాగే ఇదీనూ. అంతగా కాదుకూడదు అనిపిస్తే శ్రీ రమణ గారికి క్షమాపణలు చెప్పుకుంటూ ఉత్తరం రాద్దాం" సలహా ఇచ్చాడు రవి.

చివరకు నలుగురం కూడబలుక్కుని



# శ్రీమతికి ప్రేమలేఖ

సూర్య

ఉత్తరం రాయడం మొదలుపెట్టాము.

బాలామణీ,

ఆశీః

మా....ఛీఛీ.... నా ఆలోచనలన్నియు నీ చుట్టూ పరిభ్రమించుచు వదలివచ్చుటకు మొరాయించుచున్నవి. నా వంటి వని మనస్సు సైతము బందీకృత మొనర్చిన నీదగు రూప లావణ్యములు అసామాన్య ములు....

నీ మాట సన్నాయిపాట. నీ పలుకు సృష్టికే కులుకు. నీ రూపం నేత్రపర్వం. నా జీవితాన అది ఒక మధుర స్వప్నం....

నీ ప్రతి అణువులోనూ నవ్య శిరీష మృదుత్వం ఏదో వుంది.... నీ గురించి కలిగే ప్రతి ఊహకూ మౌనభాష్యాలు రచించుకుంటూ ఎన్నాళ్ళిలా మధుర వేదనా స్రవంతిలో ఈదులాడాలో....

నీరూపం సోకి నా మనసు ముక్కలై వడగళ్ళను వర్షిస్తోంది. ఉద్యానంలో రాలి పోతున్న విల్లీలు నా గుండెలోకి జారిపడే పిడుగులు. గుప్పెడు గుల్ మొహర్ నీడలు నా తాపాన్ని చల్లార్చలేక ఆవిరులై దిగంతాలకు పారిపోతున్నాయ్....

ఇలా సాగించి మొత్తం మూడు పేజీల ఉత్తరం పూర్తిచేశాము.

"జాలి గుండెల మేఘ మాలా బావ లేనిదే...." విశ్వం పాట అందుకున్నాడు.

"వాయిమూడు అపశకున పక్షీ! నీకు సమయం సందర్భం బొత్తిగా తెలియవు. వాళ్ళిద్దరూ సుఖంగా వున్నారు. మిత్రుడు ప్రేమలేఖ అందునా శ్రీమతికి అంటే సరదాగా రాస్తే ఈ విషాద గీతం ఏమిటిరా కాడిస్టులా!" రవిగాడు కేకలేశాడు.

ఉత్తరం పోస్టు చేసిన ఐదు రోజులకల్లా నర్సింహ్మానికి బరువైన కవరు పోస్టులో వచ్చింది. శ్రీమతి నర్సింహం నుంచి అని చూశాక మా ఆనందానికి అంతులేదు. సమాధానం ఏమని వచ్చిందోనని కవరు చింపరా అని నర్సిని తొందర చేస్తే.

"సిగ్గులేమురా. పైగా చదువుకుంటున్న వాళ్ళు. మా ఆవిడ రాసిన ఉత్తరం చదువుతా మంటారు. వెళ్ళండి వెళ్ళండి" అని మమ్మల్నందరిని బయటికి గెంటేసి రూము తలుపులు గడియ పెట్టుకున్నాడు. సరిగ్గా పది నిముషాల్లో ఆముదం తాగిన వాడిలా మొహం పెట్టుకుని బయటకు వచ్చాడు.

"ఏమయిందిరా! ఇంట్లో ఎవరికైనా జబ్బుచేసిందా?" నర్సి ఏం సమాధానం చెప్పకుండా ఓ కాగితం అందించాడు. అందులో ఏం రాసి వుందోనని ముగ్గురం ఆత్రంగా ముందుకు వంగాము ఆ కాగితాన్ని చదవడానికై.

ప్రియమైన శ్రీవారికి.

మీ వుత్తరం అందింది. మీ ధోరణిచూస్తే నాకేంటోభయంగావుంది. రాత్రిళ్ళు ఎక్కువ సేపు మేల్కొని టీ తాగకండి అతిగా. మీరు ఆరోగ్యంగా వున్నారని తలుస్తాను. ఈ వుత్తరం అందిన వెంటనే మీరు ఇక్కడికి బయలుదేరి రావలెను.

మీ గురించి వేయిన్నొక్క కళ్ళతో ఎదురుచూస్తూ

ఇట్లు

మీ........

ఆ ఉత్తరం చదివిన మా అందరికీ మతిపోయింది.

"మరి కవరు అంత బరువుగా ఉందే మిటిరా" రవి అడిగాడు.

"అమ్మవారి కుంకుమ, బాబాగారి విభూది. తాయెత్తులు పంపింది"

"నేననుకుంటూనే ఉన్నాను చిన్నపిల్ల కంగారుపడుతుందని. ఉత్తరం సరళంగా. అర్థం అయేలా వుండాలి. చందమామలో కథల్లా రాయాలిగానీ అచ్చ తెలుగులోనూ. సంస్కృతంలోనూ రాయకూడదు. భావం ముఖ్యంగానీ భాష ఎంత గొప్పగా వుందని పట్టించుకో కూడదు. మొన్న ప్రొఫెసరుగారు చెప్పారుకూడా- 'రిటెన్ కమ్యూనికేషన్‌లకు ఫాగ్ ఇండెక్స్ 8. 10 మధ్యన వుండాలి' అని..."ఇంకా ఏదో చెప్పబోతున్న విశ్వం నోరు ముయ్యడానికై ముగ్గురం చేతులెత్తాం.